సూర్య
నేటి దినపత్రిక
17వ వసంతం
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,20 సెప్టెంబర్ 2024


## ఖాతాదారుల సేవలకు ప్రాధాన్యం - కేసిబిఎస్ చైర్మన్ కోసూరి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కేసిబిఎస్ పురోవృద్ధికి కారణమైన ప్రతిఒక్క ఖాతాదారునికి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని దికాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస్ సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక రామయ్య వీధిలోని కెసిబిఎస్ కార్యాలయ ఆవరణలో సంస్థ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ట్రస్ట్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ సమస్యలకు సంబంధించి వైద్యనిపుణులు హాజరై వైద్య సేవలు అందించారు. సభ్యుల వైద్య సమస్యలకు అనుగుణంగా అవసరమైన పరీక్షలు చేసి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కేసిబిఎస్ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఖాతాదారుల తోడ్పాటుతో శత వసంతాలు పూర్తి చేసుకున్న కేసిబిఎస్ మరిన్ని మెరుగైన సేవలు అందించేదిశగా చర్యలుతీసుకుంటామన్నారు.కేసిబిఎస్ ఉపాధ్యక్షుడురెడ్డివీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి మరింత కష్టించి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోసూరితో పాటు పాలకవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కేసిబిఎస్ మాజీ అధ్యక్షులు కోసూరికృష్ణారావు,కోసూరి యదుసూర్య చిత్రపటాలకు తొలుత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ముమ్మిడి వెంకటరమణ, ముత్తా మధు, మేనేజర్ చీమలకొండ గంగాధరం ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# టూరిజం హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- సెప్టెంబర్ 27వ తేదీన వరల్డ్ టూరిజం డే సందర్భంగా విజయవాడలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా కార్యక్రమాలు
- 38 విభాగాల్లో టూరిజంకు సంబంధించిన హెూటళ్లు, స్పాట్లలో అవార్డుల ప్రదానం
- కేంద్రం సహకారంతో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో అన్ని చోట్ల టురిజం అభివృద్ధి
- కేంద్ర ప్రభుత్వ శాసి, ప్రసాద్, స్వదేశీ దర్శన్ స్కీంలతో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి చర్యలు
- రాష్ట్రంలో 4 ఐకానిక్ టూరిస్ట్ సెంటర్స్ ఏర్పాటు
- శ్రీశైలంలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు
- రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి పేరుతో ఐకానిక్ టూరిస్ట్ సెంటర్
- బాపట్లలో బీచ్ కారిడార్ అభివృద్ధి,టూరిజంహబ్‌గా సంగమేశ్వరం
- రాష్ట్రంలో టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేసే దిశగా అడుగులు
- టెంపుల్ టూరిజం అభివృద్ధికి కృషి.. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో రిసార్టుల ఏర్పాటు
- ప్రజా రాజధాని అమరావతిలో మెగా టూరిజం హబ్ ఏర్పాటు
- అడ్వంచర్ కేంద్రంగా అరకు, లంబసింగి
- రూ.25.32 కోట్లతో అన్నవరం పుణ్యక్షేత్రం అభివృద్ధి
- ఏపీటీడీసీ ద్వారా శక్తిపీఠాలు, పంచారామాలు కలుపుతూ టెంపుల్ ప్యాకేజీ
- లఘు చిత్రాల ద్వారా టూరిజంపై పర్యాటకులకు ప్రత్యేక అవగాహన
- తిరుపతి, గండికోట,పిచ్చుక లంకలో రిసార్ట్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఓబెరాయ్ గ్రూప్
- అక్టోబర్ 15వ తేదీన కేంద్ర ప్రభుత్వానికిసమగ్ర నివేదిక (డీపీఆర్) పంపించి ఆమోదం అయిన వెంటనే పనులకు శ్రీకారం
- ప్రకృతి వైపరీత్యాల కారణంగా రాష్ట్రంలో భారీగా నష్టపోయిన పర్యాటక శాఖ.. పునరుద్ధరణ చర్యలకు శ్రీకారం.
- నాటక రంగంకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు
- రాష్ట్రంలో స్టూడియోలు నిర్మించడానికి ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని సినీనిర్మాతలకు లేఖ
- తెలుగు చలన చిత్ర పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో అన్ని చోట్ల టురిజం అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్ల అంశంపై గురువారం రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి కందులదుర్గేష్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1980వ సంవత్స రం నుండి ప్రపంచవ్యాప్తంగా పర్యాటక దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు.ఈక్రమంలో సెప్టెంబర్ 27వ తేదీన విజయవాడలో రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించామని పేర్కొన్నారు. 38 విభాగాల్లో టూరిజంకు సంబంధించిన హెూటళ్లు, స్పాట్లలో అవార్డులను ప్రదానం చేయనున్నామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో మెగా టూరిజం హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

**-రాష్ట్రంలో 4 ఐకానిక్ టూరిస్ట్ సెంటర్స్ ఏర్పాటు:**

రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాజెక్టు రూ. 100 కోట్లకు మించకుండా రూ.250 కోట్లతో శాసి (స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్ ) స్కీం ద్వారా నిధులు కేటాయించేందుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. కేంద్ర అందించే సాయానికి అదనంగా సీఎం, డిప్యూటీ సీఎంల కృషితో మరిన్ని నిధులు కేటాయించేలా ప్రయత్నం చేసి మొత్తం రూ.400 కోట్లతో రాష్ట్రంలో 4 ఐకానిక్ టూరిస్ట్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొదటగా నంద్యాల జిల్లా శ్రీశైలంలో ఎకో టూరిజం, అధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. స్థానికంగా టైగర్ రిజర్వ్ ఉండటం, వాటర్ ఫాల్స్ ఇలా అన్నింటిని కలిపి టూరిజం సర్క్యూట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. రెండోది అఖండ గోదావరి పేరుతో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలను కలుపుకొని మరో ఐకానిక్ టూరిస్ట్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తామన్నారు.మూడోది బాపట్ల జిల్లాలోని అద్భుతమైన బీచ్ కారిడార్ ను అభివృద్ధిచేస్తామని, సూర్యలంకలో రిసార్ట్స్ ఏర్పాటు చేస్తామన్నారు.నాలుగవది నంద్యాల జిల్లాలోని సంగమేశ్వరం ప్రాంతాన్ని కూడా ఐకానిక్ సెంటర్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అక్టోబర్ 15వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి సంబంధింత సమగ్ర నివేదిక (డీపీఆర్)పంపించి ఆమోదం తీసుకున్న తర్వాత వెంటనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అధ్యాత్మిక కేంద్రాల్లో కొన్ని రోజులపాటుయాత్రికులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఉదాహరణకు శ్రీశైలం భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దర్శనం చేసుకున్న యాత్రికులు ఒక రోజు సత్రంలో ఉండి తిరిగి వచ్చేస్తున్నారన్నారు. ఒక పూటకే పరిమితమైన టెంపుల్ టూరిజాన్ని రెండు మూడు రోజులు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాసీ స్కీం ద్వారా ఒక ప్రాంతానికి యాత్రికులు వెళితే కేవలం దైవ దర్శనమే కాకుండా ఎకో టూరిజం, టైగర్ రిజర్వ్, వాటర్ ఫాల్స్ సైతం సందర్శించే విధంగా సంబంధిత ప్రాంతాలనుఅభివృద్ధిచేస్తామన్నారు. పుణ్యక్షేత్రాల్లో సత్రాలున్నప్పటికీ అవి రెండు మూడు రోజుల పాటు నివాసయోగ్యంగా ఉండేందుకు అనుకూలంగా లేని కారణంగా రిసార్ట్స్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- తరువాయి 5లో..

## ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవుడు ఆయుర్వేదిక వైద్యుడు జమాల్ ఖాన్



**కూనవరం,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కరక గూడెం గ్రామపంచాయతీ భైరవ పట్నం గ్రామానికి చెందిన చెచ్చుల భీమారెడ్డి వయస్సు 38 అనారోగ్యంతో కోతులు గుట్ట ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ గత ఐదు రోజుల క్రితం మరణించడం జరిగింది వారు చాలా నిరుపేద కుటుంబమే కాక భార్య ఒక కొడుకు కలిగి ఉన్నారు అతని భార్య మానసిక వికలాంగురాలు ఈ విషయాన్ని జె కె టి సి ట్రస్ట్ సభ్యులు సుఫి జమాల్ ఖాన్ గారికి తెలియపరచగా వెంటనే భైరవపట్నం గ్రామానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులకు తక్షణసాయంగా 5000 రూపాయలు అందించడం జరిగింది అలాగే వారి బాబుకి ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దగ్గరకు తీసుకొస్తే ఉచితంగా మందులు ఇస్తానని తెలియజేశారు వారి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు మీడియా కోఆర్డినేటర్ షేక్ రసూల్ మరియు ట్రస్ట్ సభ్యులు సెక్రటరీ ఎండి ఇమ్రాన్ ఖాన్, బోడ వెంకటేశ్వర్లు, గంపల కృపానందం మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేరవరంలో గోకుల్ మిషన్..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** గోమాతలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి సూచించారు. గురువారం ఏలేశ్వరం మండలం పేరవరంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గోవులకు ఉచిత గర్భకోస వ్యాధుల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ గోవులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఆయన సూచించారు. గోమాతను పసుపు కుంకుమలతో పూజించి, పూలదండలు వేసి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సనాతన ధర్మంలో ఆవులకున్న ప్రాముఖ్యతను వివరించారు.అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గోవుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఆవులను తరలించి ప్రాథమిక పరీక్షలు నిర్వహించినట్లయితే ఆరోగ్యవంతమైన దూడలకు జన్మనిస్తాయని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కోటమి నాయకులు బుద్ధ సూర్య ప్రకాష్ దేశం నాయకులు పశుసంవర్ధక శాఖ వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు

-ముఖ్య అతిధిగా పాల్గొన్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం,మేజర్‌న్యూస్ :** పి.గన్నవరంమండలం మండల పరిషత్‌కార్యాలయంలో గురు వారం పోషణ వారోత్సవాలలో భాగంగా గర్భిణీ స్త్రీలకు స్త్రీ శిశు సంక్షేమశాఖవారి అధ్వ ర్యంలో సీమంతాలు జరిగాయి. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ నెలలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పి.గన్నవరం ఎమ్మెల్యే. గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గర్భిణీ లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీఒక్కరూ పౌష్టికాహారము తీసుకోవాలని , పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని కొనియాడారు. ప్రభుత్వంద్వారా లభించే ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే చేతులమీదుగా సామూహిక సీమంతాలు అన్నప్రాసన జరిపించారు.అనంతరంవేణి ఫౌండషన్ హైదరాబాద్ వారు పంపించిన చీరలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారు తీసుకువచ్చిన పసుపు, కుంకుమ ,పండ్లు, స్వీట్స్‌గర్భిణీ లకు ఇచ్చి ఆశీర్వదించారు .ఈకార్యక్రమానికి స్త్రీశిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్‌వెంకటేశ్వరి, ఎం.పి.డి.ఓ. భారతి,ఎం.పి.పి.గనిశెట్టి నాగలక్ష్మి, స్థానిక సర్పంచ్ బొండాడ నాగమణి ,స్త్రీ శిశు సంక్షేమశాఖ సుపర్వైసర్స్ పద్మావతి ,పుణ్యవతి, జ్యోతి,మరియు అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## 15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు ప్రకారము కాకినాడ జిల్లాలో, రోడ్ యాక్సిడెంట్లను తగ్గించాలని ఉద్దేశంతో గురువారం కాకినాడ ట్రాఫిక్ పోలీస్ వారు డ్రంక్ అండ్ డ్రైవ్ 15 కేసులను బుక్ చేయడం జరిగింది. ట్రాఫిక్ పిఎస్-1 పరిధిలో 7 కేసులు, ట్రాఫిక్ పిఎస్-2 పరిధిలో 8 కేసులు నమోదయ్యాయి. వాహన తనిఖీలలో భాగంగా, తాగి వాహనం నడిపిన వాహనదారులకు 3వ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు జెఎస్‌సిఎం కోర్టులో మొత్తం 15 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు శిక్ష విధించడం అయినది. మొత్తం 15 మందిలో 05 మందికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, 10 మందికి ఒక్కొక్కరికి రూ.10,000లు చొప్పున, మొత్తం రూ. 1,00,000లు జరిమానా విధించడం అయినది.

## పార్లమెంట్ హాలులో ఏచూరి విగ్రహం ఏర్పాటు చేయాలి

- కాకినాడ జిల్లాలో నెలకొల్పే విమానాశ్రయంకు సీతారాం పేరు పెట్టాలి..
- సంస్మరణ సభలో ఘన నివాళులు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** కాకినాడ ఆత్మబంధువు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు ఏచూరి సీతారాం సంస్మరణ సభ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రెవిన్యూ ఎంప్లాయిస్ కార్యాలయ హాలులో జరిగింది. పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం కన్వీనర్ ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు సభను ఏర్పాటు చేశారు. కోకన్వీనర్ చింతపల్లి అజయ్ కుమార్ సభను నిర్వహించారు. సీతారాం ఏచూరిజాతీయ సమగ్రతకు ప్రతీకగా ప్రజాస్వామ్య ప్రగతికి వారధిగా వామపక్షాల ఉద్యమ సారథిగా యువ తరాలకు ఆదర్శంగా నిలిచిన సువర్ణ జీవితమని సభ నివాళులర్పించింది. సీతారాం కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్ హాలులో ఏర్పాటు చేసికాకినాడజిల్లాలో నెలకొల్పే విమానాశ్రయానికి నామకరణం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ సభ తీర్మానం చేసింది.అతిధులుగా జెఎన్టియుకె ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, ప్రముఖ రచయిత గొడవర్తి సత్యమూర్తి, తెలుగుదేశం, కాంగ్రెస్, వైసీపీ, జనసేన, సిపిఐ, సిపిఐ న్యూ డెమోక్రసీ లిబరేషన్, ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులతో బాటుగా మాజీ మున్సిపల్ చైర్మన్ బీరక చంద్రశేఖర్, మాజీ మేయర్లు సుంకర పావనీ, సుంకర శివ ప్రసన్న, జవహర్ ఆలీ, జాన్ జోసఫ్, పేపకాయల రామకృష్ణ, జల్లూరి వేంకటేశ్వర్లు, తాటిపాక మధు, మోర్తా రాజశేఖర్, హాసన్ షరీఫ్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, దువ్వ శేషబాబ్జీ, పెద్దింశెట్టి రామకృష్ణ, కుక్కల పోతురాజు, టి.రాజా, కొండ, యుటిఎఫ్ రమణ, తాళ్లూరి రాజు, కాళ్ళ కృష్ణమోహన్, గదులసాయిబాబా,జోగా అప్పారావు, అనపర్తి ఏడుకొండలు,కోలా ఎల్లారావు, అహ్మద్ సులేమాన్, సిద్ధాంతుల కొండబాబు, పిల్లి రవి కుమార్, గదుల నాగేశ్వరరావు, జోగా అప్పారావు, ఉదయ భాస్కర్, సుబ్బరాజు, చేయూత రవి, మాజీకార్పొరేటర్లుపాల్గొన్నారు.అనంతరం ప్రసంగించిన ప్రముఖులు ఏచూరితో ఉన్న అనుబంధాన్ని సభికులకు తెలిపారు.

## సమయస్ఫూర్తితో హాస్యం పండించడంలో దిట్ట 'రేలంగి'

- గోదావరి గట్టున విగ్రహం ఆవిష్కరణలో పాల్గొనడం తమ అదృష్టం
- పద్మశ్రీ రేలంగి విగ్రహావిష్కరణలో..
- మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** సమయ స్ఫూర్తితో హాస్యం పండించడంలో పద్మశ్రీరేలంగి వెంకట్రామయ్య దిట్టఅనిరాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అటువంటి గొప్ప నటుడి విగ్రహావిష్కరణలో పాల్గొనే అదృష్టం తమకు కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. గురువారం స్థానికగోదావరి గట్టుపై గౌతమి నందనవనం దగ్గర రాజమండ్రి గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన హాస్యనట చక్రవర్తి రేలంగి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు.ఈసందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రేలంగికి ముందు తర్వాత ఎందరో నటులు వచ్చినప్పటికీ రేలంగికి గల ఉచ్చారణ, హావభావాలుమరెవరికీ రాలేదని ఆయన అన్నారు.మాయా బజార్ సినిమాలో నటనలో సమయ స్ఫూర్తి కొట్టొచ్చినట్లు కన్పిస్తుందన్నారు. జంపలికడిపంబ అనే డైలాగ్ రేలంగి నుంచే వచ్చిందని ఆయన అన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి హాస్య నటుడు రేలంగి అని కొనియాడారు.తాడేపల్లి గూడెంలో రేలంగి చిత్రమందిర్ నిర్మించి తన ఉన్నతికి దోహదం చేసిన కెవి రెడ్డి, సి పుల్లయ్య లాంటి వాళ్ళను ఆహ్వానించి ప్రారంభింప జేయడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎస్వీఆర్, రేలంగి, సూర్యకాంతం వంటి నటీ నటులను కులాలకు అతీతంగా అందరివాళుగా చూడాలన్నారు.ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ రేలంగి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఈరోజు మరువలేని రోజుగా పేర్కొన్నారు. తన తండ్రి ఎన్టీఆర్‌కి ,రేలంగికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఎన్టీఆర్‌ని రేలంగి బావ అనిఆప్యాయంగా పిలిచేవారని, ఆయన హాస్య చతురత అద్వితీయమని గుర్తుచేసుకున్నారు. తన సోదరుడు హరికృష్ణకు రేలంగి అంటే ఎంతో ఇష్టమన్నారు. తనకు కూతురు లేకపోయినా ఒక అమ్మాయిని పెంచుకుని హరికృష్ణకు ఇచ్చి పెళ్లి చేస్తానని ఎన్టీఆర్‌తో రేలంగి తరచూ హాస్యమాడేవారనిగుర్తుచేసుకున్నారు.మిస్సమ్మ సినిమాలో ఎన్టీఆర్ , రేలంగి నటనకు సంబంధించిన డైలాగులను ఎంపీ పురందేశ్వరి ఈసందర్భంగా ప్రస్తావించారు.నటనలో సమయస్ఫూర్తి, ఉచ్చారణ, హావభావాలు చూపిస్తూ, పాత్రల్లో జీవించిన రేలంగి పద్మశ్రీ అందుకున్న తొలి హాస్యనటుడు కావడం గొప్ప విషయమన్నారు. అటువంటి గొప్ప నటుడి విగ్రహావిష్కరణలోపాల్గొనేభాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు.సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ హాస్య నటుడిగా ఎందరినో నవ్వించి, చరిత్రలో నిల్చిపోయిన పద్మశ్రీ రేలంగి విగ్రహాన్ని గోదావరి గట్టున ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలకతీతంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గొప్ప హాస్య నటుడైన రేలంగి విగ్రహావిష్కరణలో పాల్గొనే అదృష్టం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు.మాజీఎమ్మెల్సీఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ గౌడ శెట్టిబలిజసంఘం నేతలు వచ్చి విగ్రహ ఏర్పాటుకోసం అడిగిన వెంటనే కలెక్టర్ దృష్టికి తేవడం, ఆమె నాలుగు రోజుల్లోనే అనుమతి ఇవ్వడం జరిగాయని వివరించారు. గౌడ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజు, గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, కన్వీనర్స్ గెద్దాడ హరిబాబు, మార్గాని చంటిబాబు, కోశాధికారి కొండేటి భీమారావు,కో కన్వీనర్ అత్తిలి రాజు తదితరులు స్వాగతం పలికారు. అతిధులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అలాగే విగ్రహ రూపశిల్పి రాజకుమార్ వడయార్ ని సత్కరించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణకుమార్, మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్ఆర్సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డా గూడూరి శ్రీనివాస్, వైఎస్ఆర్సీపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక దంపతులు, జనసేన సిటీ ఇంచార్జి అత్తి సత్యనారాయణ, పంతం కొండలరావు, బొమ్ముల దత్తు, అశోక్ కుమార్ జైన్, వాసంశెట్టి రాజగోపాల్, అశోక్ కుమార్ గౌడ్,రేలంగి శ్రీదేవి,అల్లు బాబీ, కోడూరి శాంతారాం, తవ్వా రాజా,ఇయ్యపు మురళి, డా అనసూరి పద్మలత, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, కాలెపు సత్యసాయిరాం, హీరాచంద్ జైన్, నక్కా చిట్టిబాబు, దాలిపర్తి వేమన, అడబాల మరిడయ్య,గౌడ శెట్టిబలిజ సంఘ నాయకులు రేలంగి నాగేశ్వరరావు, మార్గాని సత్య నారాయణ, బుడ్డిగ రవి, గూడూరి రాధిక, రేలంగి శేఖర్, సూరంపూడి శ్రీహరి, గేడి అన్నపూర్ణరాజు, మాట్టా వెంకట రమణ, చిటికెన వెంకటేశ్వరరావు, టి శ్రీనివాస్, ముషిడి శ్రీనివాస్, కాగిత అప్పారావు, రెడ్డి వి ఎస్ శేషగిరిరావు, రేలంగి సూరిబాబు, వీరభద్రరావు,సత్తిబాబు, వీరమళ్ళ గోపికృష్ణ, ఇంకా వివిధ రంగాల ప్రముఖులు, కూటమి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
శుక్రవారం, 20 సెప్టెంబర్ 2024


## కె.విజయ్ కుమార్‌కి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు కె.విజయ్ కుమార్ సిద్ధాంత వ్యాసం "ఏ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఆటోమేటిక్ స్పీకర్ దయారైజేషన్ సిస్టమ్ యూజింగ్ డీప్ లెర్నింగ్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు కంప్యూటర్ సైన్స్& ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలో లభించినది. కె.విజయ్ కుమార్ తన సిద్ధాంత వ్యాసాన్ని విజయనగరంలోని జెఎన్‌టియు గురజాడ విజయనగరం యూనివర్సిటీ డైరెక్టర్, అకడమిక్ఆడిట్‌ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వర రావు ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## పవిత్ర ప్రదేశాల వద్ద మద్యం దుకాణలకు అనుమతిని నిరాకరించండి

**– ఆర్డీవోకి వినతిపత్రం ఇచ్చిన కూటమి నాయకులు**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** గురువారం కూటమి నాయకులు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి సుధాసాగర్‌ని కలిసి రామచంద్రపురం పట్టణ మార్కెట్ స్ట్రీట్ రామాలయం మొదలుకొని అన్నపూర్ణ థియేటర్ మరియు వేణుగోపాలస్వామి గుడి మధ్యలో ఉన్న దుకాణాలలో మద్యం నూతన విధానంలో బ్రాందీ షాపులకు అనుమతి ఇవ్వకూడదని రామచంద్రపురం పట్టణ ప్రజల తరఫున కూటమి పార్టీ నాయకులు డిమాండ్‌తో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగిందని జనసేన నాయకుడు సత్యవాడ శ్రీహరి పంతులు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారి సుధా సాగర్ వెంటనే స్పందించి ఆయా డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని సత్యవాడ శ్రీహరి పంతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ తరపున తెలుగుదేశం, జనసేన, బిజెపి పట్టణ అధ్యక్షులు మరియు జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో రాష్ట్రంలో, ఎన్డీయే100 రోజులు పాలన పూర్తయ్యాయి

**-సంక్షేమానికి,దేశ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది...**
**-ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** సంక్షేమానికి , దేశ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాలు కోసం 3లక్ష కోట్ల రూపాయిలు కేంద్ర ప్రభుత్వం కేటాయించడం జరిగిందని రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం స్థానిక ఎంపీక్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ సంక్షేమానికి , దేశ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాలు కోసం 3లక్ష కోట్ల రూపాయిలు కేంద్ర ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. 11 వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్ దేశం 5వ స్థానానికి వచ్చిందని,రాబోయే 5ఏళ్లలో 3వస్థానానికి చేరుకుంటుందన్నారు. మౌలికా సదుపాయాలు కోసం3లక్షకోట్ల రూపాయిలు కేటాయించారన్నారు. గ్రామ సడక్ యోజన 4వ దశ లోభాగంగా 25 వేల గ్రామాల అనుసందానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. రు. 50,600 కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు మంజూరు చెయ్యడం జరిగిందన్నారు. రైతులకి కిసాన్ సమ్మన్ యోజన ద్వారా రు. 6వేలు రూపాయిలు మూడు విడతలుగా కేంద్రం అందిస్తుందని, 17 వ ఇన్స్టాల్మెంట్ రైతులకి అందించడం జరిగిందన్నారు. దీంతో 3 లక్షల కోట్ల రూపాయలతో 12 కోట్ల రైతులకి లబ్ధి చేకూరిందని స్పష్టం చేశారు.సహకార రంగం పునర్జీవించడం చేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఉల్లి ఎగుమతి పన్ను శాతం 40 నుండి 20 శాతం తగ్గించడం జరిగిందని, క్రుడ్ పామాయిల్, సోయా నూనె 32 శాతానికి పెంచారన్నారు. హార్టి కల్చర్‌కి ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారని,టాక్స్ ఎక్సంప్షన్ రు.7లక్షలు వరకు పెంచడం వలన, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లాభం అన్నారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కేంద్రంఅందుబాటులోకి తీసుకువచ్చిందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజాన ద్వారా రు.4.70 లక్షలకోట్లు మంజూరు చేశారన్నారు.. ఇళ్లపై సోలార్ ప్యానెల్‌కి కేంద్రం సహకారం అందిస్తుందని, 35 సంవత్సరాల వారు 60 శాతం భారత్ లో ఉన్నారని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కోసం ఏఐ రంగాల్లో ఏ స్కిల్ కావాలో స్కిల్ ట్రైనింగ్ అందించడం, ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 4 కోట్ల యువతకి ట్రైనింగ్అందించేప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. అంతర్జాతీయ ఆర్థిక మందవ్యం చూస్తున్నాము,దేశంలో 7శాతంఅభివృద్ధి ఉందని, పెట్టుబడిదారులకు భారత్ అనుకూలం అన్నారు..దేశంలో మహిళలు దాదాపు 50శాతం ఉన్నారని,సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా మహిళలను చిన్న చిన్న పరిశ్రామికవేత్తలగా తీర్చిదిద్దుతున్నారని, అలాగే డ్రోన్ వాడకం పై అవగాహన కల్పిస్తున్నామని ఎంపీ పేర్కొన్నారు. రు.2500 కోట్ల రూపాయలతో కమ్యూనిటీ ఇన్వెస్ట్మెంట్ ఫండ్, గత ప్రభుత్వం నిర్లక్షం చేసింది పోలవరానికి 12,500 రూపాయిలు మంజూరు, దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి 990 కోట్లు కేంద్రం భరించడానికి సిద్ధం అయ్యిందన్నారు. అమరావతికి రు.15వేలకోట్లుకేంద్ర ప్రభుత్వంకే టాయించిందన్నారు. మూడు ముక్కలాట లాగా3 రాజధానులు అంశంగత ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ అంశంపై లాభాల్లోకి కచ్చితంగా తీసుకువస్తాము అని కేంద్ర మంత్రి ముఖ్యమంత్రి తెలిపారని స్పష్టం చేశారు.రైల్వే జోన్ మార్చమని చెప్పినప్పుడు గత ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని అన్నారు. త్వరలోనే రైల్వేజోన్ పట్టలుఎక్కబోతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికికేంద్రంప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందనలన్నారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణకు రు.280 కోట్లు డీపీఆర్ కేంద్రానికి పంపించామని,ఈస్ట్ రైల్వే స్టేషన్‌కు పుష్కరాల. నాటికి అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాజమండ్రి టు ఢిల్లీ, అయోధ్య, జైపూర్,కి విమానాలు నడపడానికి కేంద్రమంత్రికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. విమానాశ్రయ నూతన టెర్మినల్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ తో రాష్ట్రం మరియు దేశంలో అభివృద్ధి సాధిస్తామన్నారు. ఎస్.డి.ఆర్.ఎఫ్ (STATE DISASTER RELIEF FUND) నిధులు గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, మంచి ప్యాకేజీతో వరద బాధితులను రాష్ట్రం ప్రభుత్వం ఆదుకుందని ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు.

## సర్వంచ్ సతీష్‌రావు ఆధ్వర్యంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్ :** స్వచ్చత హి సేవా 2024 పక్షం రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా గురువారం రామచంద్రపురం మండలం హసన్‌బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో మూడవ రోజు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు హసన్‌బాద గ్రామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుకు స్వచ్ఛత పరిశుభ్రత గురుంచి అవగాహన కల్పించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికుల సహకారంతో చెత్త దిబ్బలను గుర్తించి వారిచే వాటిని తొలగొంచడమైనదని, పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలు గురుంచి, వారికి అందించిన అరోగ్యశ్రీ, ఆయుష్మాన్ హెల్త్ కార్డులు ఉపయోగాలు గురుంచి సర్పంచ్ పారిశుధ్య కార్మికులకు వివరించడం జరిగిందని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ భాస్కరలక్ష్మి, వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సచివాలయం, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు కృషి చేయాలి



**కాకినాడ,మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర-2047 విజన్ కు సంబంధించి జిల్లా, మండల కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పనకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిరాబ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ కమిషనర్ భావన, జాయింట్‌కలెక్టర్ రాహుల్‌మీనా,వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు సంబంధించి జిల్లా, మండలాల వారీగారూపొందించాల్సినకార్యాచరణ ప్రణాళికకు తిసుకోవలసినఅంశాలపై సీఎస్‌నీరబ్‌కుమార్‌ప్రసాద్.. జిల్లాలకలెక్టర్లకు దిశా నిర్దేశనం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు సంబంధించి జిల్లా కార్యాచరణ ప్రణాళికను అక్టోబరు 15నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో చేర్చాల్సిన ప్రధాన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ నేపథ్యంలో తొలుత మండల, మున్సిపల్ స్థాయిలో యాక్షన్ ప్లాన్ ఈ నెల 30 నాటికి రూపొందించాలన్నారు. ఇందుకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రానున్న ఐదేళ్ళ కాలంలో 2024-25 నుంచి 2028-29 వరకూ విజన్ ప్లాన్ కు నివేదిక సిద్దం చేయాలన్నారు. జిల్లాలో ప్రతీ శాఖ స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య, విద్యా విధానం, నైపుణ్య అభివృద్ధి వంటిఅంశాలపైప్రతిపాదనలుసిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం100 రోజుల పరిపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంకంపాలెం ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అంకంపాలెం ఇసుక రీచ్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేసేందుకు జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సందీప్ రెడ్డి ఆద్వర్యంలో జరిగిన సమావేశములో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అంకంపాలెం గ్రామంలో ఇసుక ర్యాంపు నిర్వహించే విషయంలో గ్రామస్తులు నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. అంకంపాలెం ఆత్రేయపురం ఇసుక రీచ్ లో 9.85 హెక్టార్లలో 98540 క్యూబిక్ మీటర్ల లో ఇసుక తవ్వకాలకుసంబంధించినప్రతిపాదనలుపంపించమని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని మైన్స్ ఏడి సాయిరాం సింగ్ గ్రామస్తులను కోరారు. పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణకు చేపట్టే చర్యలను వివరించారు. సర్పంచ్ ముత్తాబత్తులరాజు మాట్లాడుతూ గ్రామములో ఇసుక ర్యాంపు ఏర్పాటు చేయుటకు ఎటువంటి అభ్యంతరము లేదని, ర్యాంపు అవసరం ఉందనీ కాని ర్యాంపుకు వచ్చు ఇసుక లారీలు ఇతర వాహనములు తిరుగుట వలన రోడ్లుకు ధ్వంసం కాకుండా, పర్యావరణ కాలుష్యం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఏటిగట్టు రోడ్లుకు రెండు వైపులా పూర్తి స్థాయిలో గ్రావెల్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వాహన రాకపోకల సమయంలో దుమ్ము, దూళి రాకుండా, ఇసుక ర్యాంపులో స్థానికులకు ఉపాధి కల్పనకు తగు చర్యలు తీసుకోవాలనీ స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి కోరారు. అంకంపాలెం ఇసుక రీచ్ నుండి బలహీనంగా వున్న ర్యాలి వంతెనమీదుగా ఇసుక లారీలు అధిక లోడుతో వెళ్ళుట వలన దెబ్బతినే ప్రమాదము ఉన్నదని వంతెనకు తగు మరమ్మత్తులు చేయవలసినదిగా కోరారు. సమావేశములో గ్రామస్తులు సూచించినవిషయములను పరిగణన లోకి ర్యాంపు నిర్వహణకుముందే పనులుచేసిర్యాంపు నిర్వహిస్తామని, ప్రజలకు ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని తెలియజేస్తామని అన్నారు. 98,540 క్యుబెక్ మీటర్లు సాధారణ ఇసుక అంకంపాలెం రీచ్ నుండి త్రవ్వకాలు జరుపతామని ఎ.డి.మైన్స్‌సాయిరాంసింగ్ తెలియజేసారు. మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, జెడ్.పి.టి.సి.సభ్యులు,బోణం సాయిబాబా, ఎంపిడిఓ నాతి బుజ్జి గ్రామ టి.డి.పి అధ్యక్షులు, కుడప కృష్ణమూర్తి, నియోజకవర్గ టిడిపి తెలుగు యువత, కరుటూరి రవి పాల్గొన్నారు.

## ఘనంగా మోక్షగుండం జయంతి వారోత్సవాల ముగింపు




**అల్లవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక బోనం వెంకట చలమయ్య ఇంజనీరింగ్ కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వారోత్సవాలు ముగింపు సభ ఈరోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఆవిష్కరణల విభాగం నిర్వహించగా, బెంగుళూరుకు చెందిన భారత టెలికామ్ విభాగం డైరెక్టర్ కె.రామ్ మనోహర్ ఐఈఎస్, ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంజనీర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు చిన్నచిన్న మార్పులతో తమ అలవాట్లను మార్చుకోవడం ద్వారాగొప్పపరివర్తనను సాధించగలరని ఉద్భోదించారు.అలాగే చక్కటి ప్రయత్నం చేస్తే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్‌లో ఉజ్వలమైన భవిత ఉన్నదని అందుకు గలసాధ్యతను విశ్లేషించి విద్యార్థులకు స్ఫూర్తి కలిగించారు. రోజూ కేవలం రెండు గంటలు స్థిరత్వంతో చదవడం ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చుఅనిసోదాహరణంగా విశదీకరించారు. అతిథిగా గ్రామీణ మంచినీటి సరఫరా శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న జి.స్వామి, వి.కరుణశ్రీ మాట్లాడుతూ విద్యార్థులను చక్కటి ప్రణాళికతో చదువుకోవడం ద్వారా ప్రగతి సాధించ వచ్చని మార్గదర్శనం చేశారు. అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ఇంజనీర్స్ దేని వారం రోజులపాటు ఒక పండుగలా నిర్వహించడం తమ కళాశాలకు గర్వకారణమని ఐఐసి డైరెక్టర్ డాక్టర్ ఏ.రామకృష్ణ తెలియజేశారు. ప్రిన్సిపాల్‌డాక్టర్‌చంద్రమౌళి వివిఎస్ ఏ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడం ద్వారా విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడానికి కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఏ.ప్రవీణ్, డా.కె.బి.ఎస్.డీ.శర్మ, కార్యనిర్వాహణాధికారి ఏవైఆర్వి ప్రసాద్,వివిధవిభాగాధిపతులువిద్యార్థులు పాల్గొనగా వివిధ పోటీలలో ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకుసర్టిఫికెట్లప్రదానంతోవారోత్సవాలుఘనంగా ముగిశాయి.

## కేంద్రమంత్రులచే వర్చువల్‌గా 'దేవీ' ప్రోసెస్సింగ్ యూనిట్ ప్రారంభం




**కాకినాడ, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికల్పన దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడం వల్లే సత్ఫలితాలను సాధించగలుగుతున్నామని దేవి ఫిషరీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజు అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం సీతానగరం గ్రామములో నూతనంగా నిర్మించబడిన రొయ్యల ప్రోసెసింగ్ యూనిట్ ను గురువారం ఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 కార్యక్రమంలో కేంద్రమంత్రులు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలశాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి మరియు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు చేతుల మీదుగా వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 కార్యక్రమ వేదిక నుండి దేవి ఫిషరీస్ లిమిటెడ్ వారి ఈ నూతన రొయ్యల ప్రోసెస్సింగ్ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు.

మేనేజింగ్ డైరెక్టర్ వీర్రాజు మాట్లాడుతూ ఈపరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా రెండు వేలమందికి, పరోక్షంగా వేలాది మందికి జీవనోపాధి కలుగుతుందని మరియు దేశాభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉంది అని అన్నారు. తమ కేంద్ర కార్యలయం కాకినాడలో వున్నప్పటికీ ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా గ్రామీణప్రాంతాలలో తమ యూనిట్‌లను నెలకొల్పుతున్నామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

# టూరిజం హబ్‌గా ఆంధ్రప్రదేశ

4పేజి తరువాయి

**-అడ్వంచర్ కేంద్రంగా అరకు, లంబసింగి :** రాష్ట్రంలో ప్రకృతి సౌందర్య ప్రాంతాలను చూపించి పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నామన్నారు. ఓబెరాయ్, మేఫైర్ తదితర సంస్థలను ఆకర్షిస్తున్నామన్నారు. ఇప్పటికే తిరుపతి, గండికోట, పిచ్చుకలంకలో రిసార్ట్స్ ఏర్పాటు చేసేందుకు ఒబెరాయ్ సంస్థ ముందుకొచ్చిందని తెలిపారు. కేంద్ర స్వదేశీ దర్శన్ పథకం ద్వారా అరకు, లంబసింగిని అడ్వంచర్ కేంద్రంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నామన్నారు. బొర్రా గుహల్లో మంచి సౌండ్, లైటింగ్ ఏర్పాటు చేసి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని మంత్రి వివరించారు. బ్లూఫాగ్ బీచ్ గా రుషికొండ బీచ్ ను అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తున్నామన్నారు. నీరున్న పర్యాటక ప్రాంతాల్లో వాటర్ స్పోర్ట్స్ ను ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నామన్నారు.
ప్రసాద్ స్కీం క్రింద (పిలిగ్రమేజ్ రిజువనేషన్ అండ్ స్పిరుచ్యువల్ హెరిటేజ్ అగ్నమంటేషన్ డ్రైవ్) అన్నవరం పుణ్యక్షేత్రాన్నిరూ. 25.32 కోట్ల అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్నదానం కోసం డైనింగ్ హాల్, టాయిలెట్ల ఏర్పాటు, దుస్తులు మార్చుకునే గదులు, ఈ-వెహికల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. సెప్టెంబర్ 3న టెండర్లు పిలవడం జరిగిందన్నారు. తద్వారా అధ్యాత్మిక పర్యాటకానికి బాటలు వేసి అత్యధిక పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ ను ప్రకటించామన్నారు. ఆసక్తిగల వారి నుండి ప్రతిపాదనలు స్వీకరిస్తామన్నారు.
**-శక్తిపీఠాలు,పంచారామాలు కలుపుతూ టెంపుల్ ప్యాకేజీ:** ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ద్వారా ఏసీబస్సుల ద్వారా టెంపుల్ ప్యాకేజీ ప్రకటిస్తామన్నారు. టెంపుల్ సర్క్యూట్‌లో భాగంగా కాకినాడలోని ప్రధానమైన క్షేత్రాలైన కోరుకొండ, అన్నవరం, అంతర్వేది, వాడపల్లితో పాటు శక్తిపీఠాలు, సామర్లకోట, ద్రాక్షారామం లాంటి పంచారామాలను కలుపుతూ ఏసీ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.కేంద్రం కూడా పర్యాటకంపై ప్రత్యేక దృష్టిసారించిందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. లఘు చిత్రాల (షార్ట్ ఫిల్మ్స్) ద్వారా టూరిజం పై ప్రత్యేక అవగాహన కల్పించబోతున్నామన్నారు. ఇప్పటికే పర్యాటక అభివృద్ధిపై డీపీఆర్ లు సిద్ధం చేశామన్నారు. టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో ప్రచారం కల్పిస్తున్నామన్నారు. సినిమాల్లో షూటింగ్ జరిపిన ప్రాంతం పేరును పొందుపర్చాలని కోరుతున్నామన్నారు. ఉదాహరణకు పుష్ప సినిమా జరిగిన ప్రాంతం షూటింగ్ స్పాట్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో ఏపీటీడీసీక్రింద15హరితారిసార్టులున్నాయన్నారు. గతంలో వసతుల లేమి, నిర్వహణ లేని కారణంగా నాశనమయ్యాయన్నారు. వాటిని పునరుద్ధరించే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టామని త్వరలోనే పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. చంద్రగిరి పోర్టులో లైట్ అండ్ సౌండ్ షోలు ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.అందమైన ప్రకృతి సౌందర్యమున్న ఆంధ్రప్రదేశ్ లో గత ప్రభుత్వం సరైన సదుపాయాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందని మంత్రి అన్నారు. నాటి పర్యాటక శాఖ మంత్రి శాఖపై దృష్టి సారించకుండా విపక్షాన్ని విమర్శించడానికే ప్రాధాన్యతనిచ్చిన కారణంగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్ స్కీమ్ క్రింద రాష్ట్రంలోని నాగార్జున సాగర్, అహోబిలం లో ట్రైనింగ్, మార్కెటింగ్, విజిటర్ మేనేజ్ మెంట్, మౌలిక సదుపాయాలు, వాటర్ సప్లై వంటివి ప్రవేశపెట్టి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు.
**-దెబ్బతిన్న పర్యాటక ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు:** ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో పర్యాటక శాఖ బాగా నష్టపోయిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో కృష్ణా నది మధ్యలో ఉన్న భవానీ ఐలాండ్, బెరంపార్క్ ప్రాంతాలు దెబ్బతిన్నాయని,దాదాపురూ.12కోట్లనష్టంవాటిల్లిందన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాలను పరిశీలించి అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరితగతిన యథాస్థితికి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గొప్ప కవి బోయి భీమన్న జయంతిని నేడు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహిస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఏపీ టూరిజంతో కలిసి పనిచేసేందుకు రేపు వియత్నాం దేశం నుండి ప్రతినిధులు వస్తున్నారన్నారు. వారితో సంభాషించనున్నామన్నారు.
**-స్టూడియోలు నిర్మించడానికి ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం:** సాంస్కృతిక శాఖలో నాటక రంగంకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. సంగీత నాట్య అకాడమీ ఏర్పాటు చేస్తామన్నారు. సినిమాటోగ్రఫీకి సంబంధించి మంత్రి మాట్లాడుతూ సినీ నిర్మాతలకు ఇటీవలే ఒక లేఖ రాశానని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కువగా షూటింగ్‌లు చేస్తున్నారని, పర్యాటకప్రాంతాలను వెలుగులోకి తెస్తున్నారని అదే క్రమంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరానన్నారు. హైదరాబాద్ తరహా షూటింగ్‌లకు అనువుగా స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ స్టూడియోలు ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ నుండే సినిమాలకు 60 శాతం ఆదాయం వస్తుందన్నారు. సింగిల్ విండో విధానంలో షూటింగ్ లకు పూర్తిస్థాయిలో అనుమతి కల్పిస్తామన్నారు. తదనుగుణంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సినీ నిర్మాతలకు చెప్పినట్లు మంత్రి వెల్లడించారు. స్టూడియోలు నిర్మించడానికి ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని తెలిపామన్నారు. త్వరలోనే వచ్చి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. తెలుగు సినిమాకు తమ సహకారం ఉందని చెప్పేందుకు పెద్ద, చిన్న సినిమాలకు రేట్లు పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాల పై నిర్ణయం తీసుకున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లా పర్యాటక సంస్థ తరపున కడియపు లంకలో ఉన్న నర్సరీలతో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామన్నారు. కడియం నర్సరీలో రిసార్ట్ ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బోటు షికారు ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. 2027లో గోదావరికి పుష్కరాలున్న నేపథ్యంలో రాజమహేంద్రవరాన్ని రివర్ ఫ్రంట్ గా అందంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడతామన్నారు. అంతరాష్ట్ర ఉద్యోగుల బదిలీలు, ఆస్తుల పంపకంలో సుహృద్భావ వాతావరణంలో సూత్రప్రాయ అంగీకారం వచ్చిందన్నారు. త్వరలోనే ఆచరణలోకి వస్తుందని భావిస్తున్నామన్నారు. పర్యాటక శాఖలో కలుపు మొక్కల ఏరివేత కార్యక్రమం మొదలుపెట్టామని ఉగాది నాటికి నూతనత్వం ఉన్న పర్యాటక శాఖను చూస్తారన్నారు. ఐఆర్‌సీటీసీ తో భాగస్వామ్యం అవుతామన్నారు. రుషికొండ ప్యాలెస్ ను ఎలా వినియోగించుకోవాలనే విషయంలో ఆలోచిస్తున్నామన్నారు. నాగార్జున సాగర్ లా పోలవరం భవిష్యత్ లో పర్యాటక కేంద్రంగా మారే అవకాశంగా ఉంది. పట్టిసీమ, పోలవరం ను అనుసంధానించి ఎలా పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న అంశంపై ఆలోచిస్తామన్నారు తిరుమలలో పవిత్రత, లడ్డూ నాణ్యత కోల్పోయిన అంశాలను ప్రస్తావిస్తూ తిరుమల పవిత్రతను కాపాడుతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇప్పటికే కొన్ని ప్రారంభించాం రాబోయే రోజుల్లో మరిన్ని ప్రారంభించి పూర్తిస్థాయిలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

# స్వచ్ఛతా హి సేవలో యువత భాగస్వాములు కావాలి

**- పీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన నగరపాలక అధికారులు**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు.. మన చుట్టు పక్కల ఉన్న పరిసరాల పరిశుభ్రతకూ ప్రాధాన్యమివ్వాలని, అది అందరి బాధ్యత అని, ముఖ్యంగా యువతకు ఇలాంటి విషయాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి వారిలో అవేర్‌నెస్ కల్పించాలని కాకినాడ నగరపాలక సంస్థ ఈఈ మాధవి, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీఆర్ ప్రభుత్వ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనుల నిర్వహణ వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల లక్ష్యాన్ని, ఈ కార్యక్రమం నిర్వహణ గురించి ఈఈ మాధవి, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్ విద్యార్థులకు వివరించారు. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తామని, పారిశుధ్య మెరుగుకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.




అనంతరం పీఆర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో నగరపాలక కార్యదర్శి ఏసుబాబు,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐ.మురళీకృష్ణకి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్‌న్యూస్** : నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఐ.మురళీకృష్ణ సిద్ధాంత వ్యాసం "ఏ నోవల్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్ ప్రిడిక్షన్ యూజింగ్ హైబ్రిడ్ ఎన్‌సెంబిల్ మెషిన్ లెర్నింగ్ మోడల్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్‌ఈ) విభాగంలో లభించినది. ఐ.మురళీకృష్ణ తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డా.ఏ.ఎస్.ఎన్.చక్రవర్తి మరియు విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ & సిస్టమ్స్ ఇంజనీరింగ్ (సిఎస్&ఎస్ఇ) ఛైర్ ప్రొఫెసర్ డా.చల్లా నరసింహం ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## ఏ.శ్రీనివాస్‌కి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్‌న్యూస్** : నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఏ.శ్రీనివాస్ సిద్ధాంత వ్యాసం "లెవెల్ సెట్ సెగ్మెంటేషన్ ఆఫ్ మామోగ్రామ్ ఇమేజస్ యూజింగ్ కుకూ సెర్చ్ బేస్డ్ ఆప్టిమైజేషన్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది.
ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. ఏ.శ్రీనివాస్ తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగాధిపతి డా.బి.లీలాకుమారి మరియు కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.వి.వి.కె.డి.వి.ప్రసాద్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# ఏజెన్సీ పాఠశాలల్లో ఘోరాలకు గిరిజన సంక్షేమ అధికారులదే బాధ్యత

**రంపచోడవరం,మేజర్‌న్యూస్** : రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో జరిగే ఘోరాలకు ప్రధాన కారకులు గిరిజన సంక్షేమ అధికారులే అని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను ఆరోపించారు. ఒక పక్క విద్యార్థునుల పై లైంగిక దాడులు, మరోపక్క వెట్టి చాకిరీ చేయకపోతే గిరిజన బాలికలతో గుంజీలు తీయించడం దారుణమన్నారు. ముడుపులతో ఇటువంటి ఘటనలకు బాద్యులైన వారిని కాపాడుతూ గిరిజన విద్యార్థులను గాలికి వదిలేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులపై చర్యలకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో చదువుతున్న విద్యార్థినులకు కనీస రక్షణ కరువైందని, విద్య బుద్దులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులు చేయడం విద్య వ్యవస్థ కె సిగ్గు చేటన్నారు. అటువంటి వారిని సస్పెండ్ చేయడం కాదు, పూర్తిగా ఉద్యోగం నుండి తొలగించాలని, అదే విదంగా కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల రంపచోడవరం గురుకుల కళాశాలలో చోటు చేసుకున్న సంఘటనపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందాన్ని హాస్పిటల్‌లో ఉన్న విద్యార్థుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకొనేందుకు పంపించడం జరిగిందన్నారు. తమ బృందానికి విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకుంటూ



కళాశాలలో ప్రిన్సిపాల్ వారిని అనేక విధాలుగా హింసిస్తున్నారు అని తెలిపారు. విద్యార్థులను వ్యక్తిగత పనులకు ఉపగించుకుంటారని, వినకపోతే తీవ్రంగా పనిష్మెంట్ ఇస్తారన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు చెప్పకూడనవి అక్కడ నడుస్తున్నాయి అని, ఈ విషయాలు అన్ని ఐటీడీఏ పీవో కు చెబుతామంటే పరామర్శించడానికి వచ్చిన పిఓ విద్యార్థులను దూషించడం, ప్రతీ చిన్నదానికి గొడవలు సృష్టించే సంఘాలు, పార్టీలకు ఎందుకు చెబుతారు, మీ సమస్యలు మాకు చెప్పాలని అంటూ విద్యార్థులు చెప్పే మాటలు వినకుండా వెళ్ళిపోయారని విద్యార్థులు చెప్పినట్లు ఆయన అన్నారు. విద్యార్థులను పరామర్శించిన అనంతరం తమ బృందం కళాశాలకు వెళ్లగా అక్కడ విద్యార్థులను కలవనివ్వలేదని, పిఓ దగ్గరికి వెళ్లి వినతిపత్రం ఇస్తున్నా వినతిపత్రం తీసుకోవడానికి ఇష్టపడలేదన్నారు.
విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పాఠశాలలను సందర్శిస్తే లోపల జరిగే బాగోతాలు బయటకు వస్తాయి అనే అధికారులు, పాఠశాల, కళాశాల యాజమాన్యంలు విద్యార్థి ప్రజా సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదు, ఇది సరి కాదు, విద్యార్థి సంఘాలకు పాఠశాలలో ప్రవేశం ఉంటేనే విద్యార్థులు తమ సమస్యలు స్వేచ్ఛగా చెప్పుకుంటారు. అవి ఉన్నత అధికారులు దృష్టిలోకి వస్తాయి.
లేకుంటే ఇలాంటి లైంగిక వేధింపులు, విద్యార్థులను వెట్టి చాకిరి చేయించడం, విద్యార్థులను హింసించడం వంటి ఘటనలు ఆగవు అని అన్నారు. పాఠశాల, కళాశాల యాజమాన్యంతో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు కొన్ని రకాల బంధాలు వలన ఇటువంటి ఘటనలు జరిగిన పటించుకోవడం లేదని. కాని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఐటీడీఏ నిర్లక్ష్యంపై జాతీయ ఎస్టీ కమీషన్‌కి పిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు.

## పరిశుభ్రత అందరి బాధ్యత

### - గ్రామపంచాయతీ కార్యదర్శి



**ఎటపాక, మేజర్‌న్యూస్ :** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామపంచాయతీలో గల గుండాల కాలనీ గ్రామంలో స్వచ్ఛత హీ సేవ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని గుండాల గ్రామపంచాయతీ సర్పంచ్ గుండు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రం ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని, పరిశుభ్రతతో ఆరోగ్యమైన జీవన జీవన విధానం సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. భారతదేశాన్ని స్వచ్ఛత వైపు తీసుకెళ్లాలని, మహాత్మా గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎంజయలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి,వెటర్నరీ అసిస్టెంట్ అల్లేష్,మహిళాకానిస్టేబుల్, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సూర్య కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు



ఎటపాక, మేజర్‌న్యూస్ : కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు అనే కథనాన్ని ఇటీవల కాలంలో సూర్యపత్రికలో ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి కబ్జాకు గురైన 29 ఎకరాలభూమిని స్వాధీన పరచుకోవడం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాఎటపాక మండలం నెల్లిపాక పంచాయతీ పరిధిలో గల గోగుబాకగ్రామంలో కొంతమంది భూకబ్జాదారులు 13/2 సర్వే నెంబర్ గల 29 గల ప్రభుత్వ భూమి కబ్జా చేయడం జరిగింది. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిపై సూర్య దిన పత్రికలో కబ్జా గురైన ప్రభుత్వ భూములు అనే అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి ఎటపాక తాసిల్దార్ పృధ్వి స్పందించి, ఎటపాక తహసీల్దార్ పృథ్వి ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సిబ్బంది, ఎటపాక సీఐ ఎం.కన్నప్ప రాజు, ఎటపాక ఎస్సై పార్థసారథి నేతృత్వంలో, పోలీస్ సిబ్బందితో కలిసి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించి, కబ్జా గురైన 13/2 ప్రభుత్వ భూమిని రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని కబ్జాదారులకు హెచ్చరికలు దారి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎటపాక తాసిల్దార్ పృథ్వి మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలను ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

### త్వరితగతిన ఇసుక అందించేందుకు

## యూజర్ ఫ్రెండ్లీ ఆన్‌లైన్ పోర్టల్ దోహదం




**కాకినాడ, మేజర్‌న్యూస్** : నూతన ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా వినియోగదారులు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా మరింత సౌలభ్యంతో ఇసుక పొందేందుకు రూపొందించిన ఆంధ్రప్రదేశ్ సాండ్ మేనేజ్మెంట్ పోర్టల్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం అమరావతి నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంఎల్సీ కర్రి పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, గనులశాఖ డిడిఈ.నర్సింహారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈసందర్భంగాముఖ్యమంత్రిమాట్లాడుతూ వినియోగ దారులకు పారదర్శకంగా, త్వరితగతిన ఇసుక అందించేందుకు ఈ యూజర్ ఫ్రెండ్లీ ఆన్‌లైన్ పోర్టల్ దోహదం చేయగలదని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక వనరులను అందుబాటులోకి తేవడంతోబాటు, ఇసుక త్రవ్వకం, రవాణ చార్జీలను వీలైనంత కనిష్ట స్థాయికి నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన జిల్లా కలెక్టర్లకు సూచించారు. అలాగే జిపిఎస్ ట్రాకింగ్, సిసి కెమేరాలు, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలతో ఇసుక అక్రమాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. ఇసుక బుకింగ్‌కు సంబంధించి వినియోగదారులకు సమాచారం అందించడం, సందేహాల నివృత్తి చేయడం కొసం రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలు అందిస్తుందని, అదే తరహాలో జిల్లా స్థాయిలో వినియోగదారుల కొరకు ఫెసిలిటేషన్ కేంద్రాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో బాటురాష్ట్ర ఎక్సైజ్, గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా స్థాయి శాండ్ కమిటీ వినియోగదారుల సమాచారం, ఇసుక రవాణా వాహనదారులకు సూచనలు తదితర అంశాలతో ప్రచురించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం, ఆన్‌లైన్ సాండ్ బుకింగ్ పోర్టల్ సేవల గురించి విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లాలో 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కుసంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, ట్రాన్స్ పోర్ట్, సహకార, లీగల్ మెట్రాలజీ, భారత ఆహార సంస్థ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సీఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై జిల్లా కలెక్టర్..అధికారులు, రైస్ మిల్లర్లతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ట్రాన్స్ పోర్ట్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో 5.18లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాకుగాను, స్థానిక వినియోగం నిమిత్తం 1.04 లక్షల మెట్రిక్ టన్నులు పోను సుమారు 4.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్ కు రానుందని తెలియజేశారు. ఇందులో మిల్లర్ల ద్వారా సుమారుగా 1.40 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా మిగిలిన 2.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఇందుకు అవసరమైన సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 (75 కేజీలకు రూ.1,740), సాధారణ రకం క్వింటాకు రూ.2,300 (75 కేజీలకు రూ.1,725) లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణలో ప్రభుత్వ అధికారులతో సహకరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మిల్లర్ల ప్రతినిధులను కోరారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే సీతారామరావు, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాల సరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం.వి.ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్, మార్కెటింగ్ ఏడి కే.ఆర్.ఆర్. నాగేశ్వరరావు, సహకార, ట్రాన్స్ పోర్ట్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖలో భారీ అన్న వితరణ



**కాకినాడ,సెప్టెంబర్19:** వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకొని గురువారంకాకినాడదేవాదాయశాఖ ఉపకమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ ఆర్జేసీ కే.సుబ్బారావు హాజరై అన్న ప్రసాదాన్ని అందరికీ వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది వినాయక చవితి మహోత్సవాలను తమ దేవాదాయశాఖ ఆవరణలో ఉన్న వినాయక స్వామివారి ఆలయంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. నవరాత్రులు ముగిసిన అనంతరం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించి హాజరైన భక్తులకు దగ్గరుండి తమ సిబ్బంది ద్వారా వడ్డిస్తామన్నారు. తమ సిబ్బంది అందిస్తున్న సహకారం వల్లనే ఈ కార్యక్రమం విజయవంతంఅయిందని అందువల్ల వారికి సుబ్బారావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించడం ఎంతో సంతృప్తినిచ్చిందని సుబ్బారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కెవివి రమణ, పర్యవేక్షకుడు కే నాగేశ్వరరావు, డీఈవో టీవీఎస్ సుబ్రహ్మణ్యం, అర్చకులు జోగయ్యశాస్త్రి, కార్యాలయ సిబ్బంది, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో క్లాప్ వాహనాలు నడిపించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో అధికారులకు డ్రైవర్ల విన్నపము
- ఎంహెచ్‌ఓ హామీ పట్ల హర్షం వ్యక్తం చేసిన డ్రైవర్స్



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో గల క్లాప్ వాహనాల నడిపించాలని, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని బుధవారం సాయంత్రం సిఐటియు ఆధ్వర్యంలో క్లాప్ వాహన డ్రైవర్స్ నగర పాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వి చరణ్ జోక్యం చేసుకుని సిఐటియు నాయకులు పలివెల వీరబాబుతో ఫోన్ లో మాట్లాడారు. క్లాప్ వాహన కాంట్రాక్టర్స్‌కి అర్బన్ లోకల్ బాడీస్ ద్వారా బిల్లులు చెల్లించాలని ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయన్నారు. వాహనాలు త్వరలోనే వర్కింగ్‌లోకి తీసుకుని వస్తామని, డ్రైవర్స్ ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ క్లాప్ వాహనాలు ప్రతి నిత్యం నగరంలో తడిచెత్త పొడిచెత్త సేకరణలో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి అందరికి తెలిసిందే అన్నారు. క్లాప్ వాహన డ్రైవర్స్ కి కనీస వేతనాలు అమలు కాకపోయినా, జీతాలు సకాలంలో అందకపోయినా, నగర పాలక సంస్థ మీద నమ్మకంతో, ఎప్పటికైనా మంచి జరుగుతుందనే ఆశతో విధులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుండి 4 రోజులపాటు 34 పెట్రోల్ వాహనాలు నిలిపి వేసారని, 5 వ తేదీ నుండి 75 గ్యాస్ వాహనాలు నిలిపి వేయడం జరిగిందన్నారు. కాంట్రాక్టు సంస్థ వారిని అడిగితే జనవరి నుండి ప్రభుత్వం నుండి తమకు బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి క్లాప్ వాహనాలు నడిపించాలని కోరుతున్నామన్నారు. క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ తమ ఉపాధి కొనసాగే విధంగా ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఎంహెచ్‌ఓ స్పందన పట్ల సిఐటియు క్లాప్ వాహన డ్రైవర్స్ తరపున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకట రమణ, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు భద్ర, కొండబాబు, శివశంకర్, గంగాధర్, శ్రీనివాస్, సంతోష్, విక్టర్, పూర్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జమాల్ ఖాన్ సన్మానించిన మన్యం కవి



**చింతూరు, మేజర్‌న్యూస్** : ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు మహమ్మద్ జమాల్ ఖాన్ సేవలను ప్రజా ఆదరణను చూసి ప్రముఖ మన్యం కవి నూనె రమేష్ గురువారం జమాల్ ఖాన్ ఆశ్రమానికి వచ్చి శాలువాను కప్పి జమాల్‌ఖాన్ సేవలుఆయనగొప్పతనాన్ని కొనియాడుతూ రాసిన కవిత్వాన్ని బహుకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మన్యం కవి మాట్లాడుతూ కష్టకాలంలో ప్రజలను ఆదుకునే దాన గుణం ఉన్న ఉత్తముడని తన కవిత్వంలో పేర్కొనడం జరిగింది. మన్యం వాసుల మనసును దోచుకున్న ఆయుర్వేద శిఖామణి, అందరిబంధువు అన్నదాత, కన్నీళ్లను తుడిచి కష్టాల సుడిగుండాల నుండి కాపాడే దాన గుణ సంపన్నుడని తన కవిత్వంలో నిక్షిప్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పుట్టి పెరిగి ఆయుర్వేదంలో దేశ విదేశాల్లో సేవలు అందించి అందరి మన్ననలను పొందిన వ్యక్తి జమాల్ ఖాన్ అని ఇది జగమెరిగిన సత్యం అని ఈ సందర్భంగా కొనియాడారు. జాతి మతం కులం వంటి ఏవి అతని సేవలకు అడ్డు రావని, అందరూ సమానమే అంటూ అన్ని మతాలు కులాలు ఒకటేనని చాటి చెబుతూ అందరినీ కలుపుకొనిపోతూ తనదైన శైలిలో ముందుకు నడిచే మహోన్నత వ్యక్తి అని చాటాడు. ఆయుర్వేదమే ఆయుధంగా అన్ని రోగాలను అంతం చేసే మహోన్నత శక్తి కలిగిన వ్యక్తి అని తెలిపారు.

## నాడు పూర్వ విద్యార్థి ..నేడు ఉత్తమ ఉపాధ్యాయుడు



**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి** : మండల కేంద్రం కరప జెడ్‌పి హై స్కూల్ పూర్వ విద్యార్థి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా పౌర సన్మానం చేసారు.నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కరప పూర్వ విద్యార్థి, ఇదే పాఠశాలలో విద్యా వాలంటీర్‌గా 4 సంవత్సరములు సేవలు అందించి అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందారు ఇదే గ్రామానికి చెందిన చింతా నారాయణమూర్తి. ప్రస్తుతం ఆయన కాజులూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు బృందం ఆయన్ను ఘనంగా సత్కరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అధ్యక్షతన ఉపాధ్యాయులు మారిశెట్టి రమేష్ సహకారంతో పౌర సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారులు కే.బుల్లి కృష్ణవేణి, ప్రత్తి సత్యనారాయణ హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, గ్రామ సర్పంచ్ సాదే ఆశా జ్యోతి హాజరయ్యారు. విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ నారాయణ మూర్తికి అవార్డు ప్రకటించడం ద్వారా ఆ అవార్డుకే గౌరవం దక్కిందన్నారు. ఆయన పాఠశాల లో ఉత్తమ సేవలు అందిస్తూనే స్వగ్రామానికి, తాను పనిచేస్తున్న పాఠశాలకు తన మాతృమూర్తి పేరు మీద సేవలు అందించడం శుభ పరిణామం అన్నారు.జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ అవార్డు గ్రహీత తనతోపాటే ఉద్యోగం సాధించిన మిత్రుడు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాకినాడ ఉప విద్యాశాఖాధికారి వ్యక్తిగతంగా అతని సేవలను గుర్తించి ఆయనను అవార్డుకి ఎంపిక చేయడం జరిగిందని తెలియజేసారు.సర్పంచ్ సాదే ఆశా జ్యోతి కుమార్ మాట్లాడుతూ మాష్టారు సేవలను నేను ప్రత్యక్షంగా చూశానని ఇటువంటి ఉత్తమ ఉపాధ్యాయుడు మన ఊరి పాఠశాల పూర్వ విద్యార్థి కావడం విద్యార్థులందరికీ స్ఫూర్తి దాయకం అని అన్నారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు మాట్లాడుతూ చేయూత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక కార్యదర్శి అయిన చింతా నారాయణమూర్తి గ్రామంలో ఎంతో మందికి వైద్య, విద్యా సంబంధిత సహాయాలు, నిత్యావసర సరుకులు అందించడమే కాకుండా వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా ఉన్నత సేవలు అందించడం అభినందించదగ్గ విషయం అన్నారు. కూటమి నాయకులు పేకేటి దుర్గా ప్రసాద్, నాగు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న మానవత్వం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జొన్నలగడ్డ రాజు, చేయూత సంస్థ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి స్ఫూర్తితోనే మా గ్రామంలో అనేక సేవాకార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలియజేసారు.

## సాంప్రదాయాలకు ప్రాధాన్యతనివ్వాలి

### - ఘనంగా గబ్బర్ సింగ్ కుమార్తె వోణీ వేడుక



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : పాశ్చాత్య పోకడలు విడనాడి మన దేశ సాంప్రదాయాలకు విలువలు నివ్వాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు ఆయన గురువారం ఎంపీ గంటి హరీష్ మాధుర్ జనసేన నియోజకవర్గ బాధ్యుడు బండారు శ్రీనివాస్ తో కలిసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు గబ్బర్ సింగ్ కుమార్తె సోనిక ప్రణవి వోణీ వేడుకలకు హాజరై ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్రేయపురం ఆతిథ్యానికి పూతరేకులకు ప్రసిద్ధి పెట్టింది పేరన్నారు. ఇక్కడి ప్రజలు గౌరవ మర్యాదలతో ఇట్టే ఆకట్టుకుంటారన్నారు. మహిళకు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ఇసుక సరఫరా లో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ వేడుకలో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నాయకులు ముదునూరిరామ్‌బద్రిరాజు,మెట్ల రమణబాబు,కె.విసత్యనారాయణరెడ్డి,ఆకులరామకృష్ణ, నియోజక వర్గ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామర్లకోట మండల స్థాయి స్కూల్ గేమ్స్

**సామర్లకోట,మేజర్న్యూస్ :** మండల స్థాయి స్కూల్ గేమ్స్ ,గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఎంపికలు గవర్నమెంట్ హై స్కూల్ సామర్లకోట గ్రౌండ్ నందు జరుగును..20వ తేదీ న బాయ్స్ కు, 21వ తేదీన బాలికలకు, వాలీబాల్, కబడ్డీ, కో.కో, బ్యాట్మెంటన్,చెస్,యోగా, అథ్లెటిక్స్, నందు ఎంపికలు జరుగును. మొదటి రోజు 20వ తారీకు ఉదయం 10 గంటలకు ప్రజా ప్రతినిధులు సమక్షంలో క్రీడా పోటీలు ప్రారంభించబడును..

మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల నుండి క్రీడాకారులు అందరూ హాజరవుటకు అర్హులు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అందరూ మీ పాఠశాలలో పై క్రీడాంశాల్లో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులనుఆయాతేదీల్లో ఎంపికలకు పంపించ వలసిందిగా సామర్లకోట ఎంఈఓ 1 శివరామకృష్ణ , సామర్లకోట ఎంఈఓ 2, పుల్లయ్య సామర్లకోట మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం వెంకటేశ్వర్లు తెలియజేసారు.

## రెడ్ క్రాస్ భవనం నందు స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ భవనము నందు స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజమహేంద్రవరం రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొని భవనం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను ఏరివేసి అందంగా తయారు చేశారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ బోను రామకృష్ణ మాట్లాడుతూ పరిసరాల సుచి, శుభ్రత అందరి బాధ్యత అని పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మానవ కోటి ఆరోగ్యంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంటూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు జూనియర్ కళాశాల వాలంటీర్ల ను అభినందిస్తూ సొసైటీ ద్వారా అందించే సేవలు గురించి రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ శ్రీమతి ఆర్ మహాలక్ష్మి గారు వివరించారు ప్రథమ చికిత్స ఆవశ్యకత అపాయంలో లేదా ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స ఎలా చేయాలో వివరించారు. స్వచ్ఛత హీ కార్యక్రమం 2024 లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజమహేంద్రవరంలో ప్రతిజ్ఞ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ వి ఎల్ నరసింహ అధ్యాపకులు పాల్గొన్నారు.

# కొలెస్ట్రాల్ అదుపులో ఉండాలంటే వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరి

-40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకోవాలి
-తరచూ బిపి చెక్ చేయించుకోవాలి
-డాక్టర్ శ్రీ రాజేశ్వరి సలాది

**పెరవలి, మేజర్ న్యూస్ :** కొలెస్ట్రాల్ లెవెల్స్ అదుపులో ఉండాలంటే తగినంత వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ శ్రీ రాజేశ్వరి సలాది అన్నారు. సెప్టెంబర్ 19వ తేదీ గురువారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ కొలెస్ట్రాల్ లెవెల్స్ గమనిస్తూ ఉండాలని దానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న డాక్టర్లను సంప్రదించి వారు చెప్పిన సూచనలు సలహాలు పాటించాలని ఆమె అన్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువైతే ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయో ఆమె వివరించారు. మన శరీరంలో రెండు రకాల కొలెస్ట్రాల్ లు ఉంటాయి ఒకటి చెడు కొలెస్ట్రాల్ దీన్ని ఎల్ డి ఎల్ అంటారు ఇంకోటి మంచి కొలెస్ట్రాల్ దీన్ని హెచ్ డి ఎల్ అంటారు. చెడు కొలెస్ట్రాల్ ఎక్కువ అయితే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే మనకు శరీరం కొన్ని సూచనల ద్వారా తెలియజేస్తుంది. అలాగే కొన్ని లక్షణాలను



కూడా చూపిస్తుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే చర్మంపై పసుపు లేదా ఎరుపు రంగులో కురుపులు వస్తాయి. ముఖ్యంగా మోచేతులు మోకాళ్లు చేతులు పాదాలు ముక్కుపై ఈ కురుపులు వస్తాయి. ఇవి సైజులో ఒక్కోసారి మూడు ఇంచుల వరకు ఏర్పడతాయి. అయితే ఈ కురుపులను చూసి చాలా మంది మొటిమలు లేదా వేడి వల్ల ఏర్పడిన కురుపులు కావచ్చని అనుకుంటారు. కానీ అలా ఏర్పడితే ఏమాత్రం ఆలస్యం చేయరాదు వెంటనే కొలెస్ట్రాల్ టెస్ట్ చేయించుకోవాలి. ఇక కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉంటే శరీరంలో రక్త సరఫరా సరిగా ఉండదు. దీంతో బిపి పెరుగుతుంది అలాగే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తూ ఉంటాయి. చేతిలో నొప్పిగా ఉంటుంది. ఈ లక్షణాలను కూడా గమనించాలి. ఇవి కూడా ఉంటే కొలెస్ట్రాల్ లెవెల్స్ ఎక్కువగానే ఉన్నట్లు అనుమానించాలి. అటువంటి సందర్భాలలో డాక్టర్ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. కొలెస్ట్రాల్ లెవెల్స్ ఎక్కువ ఉంటే రక్తప్రసరణలో హెచ్చుతగ్గులు ఉంటాయని తద్వారా బీపీ హెచ్చుతగ్గులు వస్తాయి కావున ప్రతి ఒక్కరు తరచూ బిపిని చెక్ చేయించుకోవాలని ఆమె అన్నారు. ఒకవేళ నిజంగానే కొలెస్ట్రాల్ లెవెల్స్ ఎక్కువగా ఉంటే డాక్టర్ సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా వాడుకోవాలి అన్నారు. అలాగే రోజు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయాలి దీంతో కొలెస్ట్రాల్ లెవెల్స్ తగ్గుతాయి. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేస్తూ మూడు నెలలకు ఒకసారి డాక్టర్ను సంప్రదిస్తూ ఉంటే ఈకొలెస్ట్రాల్ సమస్యలను అధిగమించవచ్చునని ఆమె అన్నారు.

## ఆయుకట్టు రైతులు వాటర్ లిస్ట్ తయారీపై ఆర్డీవో సమీక్ష



పెద్దాపురం, మేజర్న్యూస్: రెవెన్యూడివిజనల్అధికారికార్యాల యం లో గురువారం ఆర్డీవో జే. సీతారామారావు అందరి తహశీల్దార్లు, మరియు 4 పుష్కర కాలువడివిజన్ డిఈఈ, ఏఈఈ లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పుష్కర కాలువ వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయుటకు, ఆయకట్టు క్రింద వున్న రైతులతో ఓటర్ లిస్ట్ తయారు చేయు విషయమై ఆదేశాలు ఇవ్వడం అయినది. డివిజన్ లోని పెద్దాపురం, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు, శంఖవరం, తుని మరియు తొండంగి మండలలో పుష్కర కాలువ వాటర్ యూజర్స్ అసోసియే ష న్ ఏర్పాటు చేయవలసి నదిగా ఆర్డీవో సూచించారు.

## రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లపై విద్యార్థులకు అవగాహన



**పెద్దాపురం రూరల్,మేజర్న్యూస్ :** పెద్దాపురం మహారాణి కళాశాల నందు గురువారం రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ వ్రాత పరీక్ష నిర్వహించి, దానిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.50 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు నగదు చెల్లిస్తామని మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ టెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో 60శాతం మార్కులు వచ్చి ఉండాలని, వార్షికాదాయం రూ.2,50,000 నుంచి 15 లక్షల వరకు ఉండవచ్చునని, ప్రధానంగా రూ.2,50,000ల క్రింద ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు త్వరలో టెస్టు నిర్వహిస్తామని, ఎం.ఆర్. కళాశాలలో సెకండియర్ విద్యార్థిని వేణు గత 2 సంవత్సరాల స్కాలర్‌షిప్ టెస్టు వ్రాసి, క్వాలిఫై అయి, స్కాలర్‌షిప్ తీసుకుంటుందని, ఈ సందర్భంగా విద్యార్థి వేణును అభినందించారు. ఆశక్తి గల విద్యార్థులు రిలయన్స్ ఫౌండేషన్ వెబ్‌సైట్ www.schlorship-sreliancefoundation.org లేదా రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెం.18004198800 నెంబర్‌ను సంప్రదించాలని మేనేజర్ నాగేశ్వరరావుతెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రొగ్రామ్ సపోర్టర్ యు.రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## టేకు కలప పట్టివేత వ్యాన్ సీజ్
## -ఎఫ్ఎస్ఓ రాము




**రాజువొమ్మంగి,మేజర్న్యూస్:** మండలంలోని వట్టిగడ్డ నుండి అనకాపల్లి జిల్లాకృష్ణ దేవి పేట బొలెరో వాహనంలో అక్రమంగా తల్లిస్తున్నరూ 12 వేలు విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకొని బొలెరోవ్యాన్ సీజ్ చేసినట్లు రాజవొమ్మంగి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాము తెలిపారు. బుధవారం రాత్రి సుమారు 0.7 సిఎంటి 6లి6 సైజులు కలిగిన టేకు మంచం కలప అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తుండగా రాజవమ్మంగి గ్రామ శివారు ఎం కె రైస్ మిల్ సమీపంలో తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు సెక్షన్ ఆఫీసర్ రాము తెలిపారు. స్థానిక రేంజ్ అధికారి మడకం అబ్బాయి దొర ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి రికార్డులు సబ్ డిఎఫ్ వో ఆఫీస్ కు తరలించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ ఎస్ ఓ రాము, ఎఫ్ బి ఓ ప్రసాద్, చెరుకుంపాలెం, రాజవొమ్మంగి బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు. కలప అక్రమ రవాణా కు పాల్పడితే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఫారెస్ట్ రేంజ్ అధికారి మడకం అబ్బాయి దొర,ఎఫ్ఎస్ ఓ రాము హెచ్చరించారు.

## ఖండవల్లి అంగన్వాడి సెంటర్ 26, 28లో పౌష్టికాహార మాసోత్సవాలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్లు నెంబర్ 26, 28 సెంటర్ల సంయుక్తంగా సెప్టెంబర్ 19వ తేదీ గురువారం పౌష్టికాహారమాసోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడి సెంటర్ కు వచ్చే పిల్లల తల్లిదండ్రులతో గర్భిణీలు బాలింతలతో ఖండవల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ సెంటర్లలో ఈపౌష్టికాహారమాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ వి సరోజినీ పౌష్టికాహారం గురించి తల్లిపాల విశిష్టత గురించి గర్భిణీలకు బాలింతలకు వివరించారు. పౌష్టికాహార మాసోత్సవాలు సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలోబాలఅమృతం వంటి పౌష్టికా హారం ఇస్తున్నామని ఆమె అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే కలిగే రోగ నిరోధక శక్తి ని తల్లిపాలు పట్టించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సరస్వతి, రాణీరత్నకళ, హెల్త్ అసిస్టెంట్ రాణి,అంగన్వాడీలు దాసరి దుర్గాదేవి, ఆర్ కుమారి పాల్గొన్నారు.

## కాపవరం అంగన్వాడి సెంటర్లో పౌష్టికాహార మాసోత్సవాలు

-ముఖ్యఅతిథిగా సిడిపిఓ శ్రీలక్ష్మి



**పెరవలి, మేజర్ న్యూస్ :** కాపవరం గ్రామంలో సెప్టెంబర్ 19 వ తేదీ గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహార విశిష్టతను తె లి య ం జే శా ర ం అంగన్వాడీ సెంటర్లలో ఇచ్చే బాలామృతం పిల్లలకు చక్కటి పౌష్టికాహారంగా ఉపయోగపడుతుందని తల్లిపాలతో పాటు బాలమృతాన్ని పౌష్టికాహారంగా పిల్లలకి అందించి అందిస్తే వారు చక్కగా ఆరోగ్యంగా ఎదుగుతారని దీనినే తల్లులు అందరు గమనించాలని కోరారు.

సూపర్వైజర్ సిహెచ్ లక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు అంగన్వాడీల సలహాలు సూచనలను పాటిస్తే చక్కటి ఆరోగ్యంవంతమైన శిశువులు జన్మిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీ, ఎంపీటీసీ మెర్ల వెంకటేశ్వరరావు, సిడిపిఓ శ్రీలక్ష్మి, సూపర్వైజర్ సిహెచ్ లక్ష్మి, అంగన్వాడీలు కన్యాకుమారి, జే విజయలక్ష్మి, యు విజయకుమారి, అంగన్వాడి వర్కర్లు, స్థానిక హెల్త్ సిబ్బంది కూటమి నాయకులు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

# దేవీ నవరాత్రులకు భారీ ఏర్పాట్లు

- విజయవంతమైన గణపతి ఉత్సవాలు



**కాకినాడ,మేజర్న్యూస్ ప్రతినిధి :** ఉత్తరాంధ్ర,ఉమ్మడిగోదావరి, కృష్ణా జిల్లాలలో గణపతి నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా ముగిసాయని దేవాదాయ శాఖ రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ కమిషనర్, కాకినాడ ఇన్చార్జి డిప్యూటీ కమిషనర్ కే.సుబ్బారావు తెలిపారు. దేవీ నవరాత్రులు భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఈ ఆరు జిల్లాలలో ఏర్పాట్లు పూర్తికావచ్చాయి అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి కొత్త అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫెస్టివల్ గా ప్రకటించింది అని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ఈ ఉత్సవాలలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. కాకినాడలోని దేవాదాయశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ సంపద విజయ వినాయక స్వామివారి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని గురువారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో రమణ నేతృత్వంలో డిప్యూటీ కమిషన్ కార్యాలయ సూపరిండెంట్ కే.నాగేశ్వరరావు, కాకినాడ డీఈఓ తోట సుబ్రహ్మణ్యం, ఇన్స్పెక్టర్ వడ్డి పనింద్ర కుమార్ ఆధ్వర్యంలో 10 రోజులపాటు ఈ ఆలయంలో వైభవంగా పూజలు జరిగాయి. ప్రతి ఏటా నవరాత్రులు ముగిసిన తర్వాత డిసి కార్యాలయ ప్రాంగణంలో వేలాదిమందికి అన్నదానం నిర్వహించడం అనవాయితీ. గురువారం ఈ కార్యక్రమాన్ని జాయింట్ కమిషనర్ సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రుల సందర్భంగా మొత్తం ఎనిమిది వందలకు పైగా చిన్న, పెద్ద ఆలయాలలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగింది అన్నారు. ప్రతి ఆలయంలో ఖచ్చితంగా ఉచిత దర్శనంతో పాటు ప్రసాదం, మంచినీరు పంపిణీ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారుకు.ప్రోటోకాల్ దర్శనాలకు ఆటంకం కలగకుండా అదే సమయంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసేలా ఆయా ఆలయ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఉమ్మడి ఆరు జిల్లాలకు సంబంధించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. లక్షలాదిమంది భక్తులు వచ్చే దేవీ నవరాత్రులకు ఆయా ఆలయాల సంస్కృతి సాంప్రదాయాలకనుగుణంగా ప్రతిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో ఈఈ తోట దుర్గేష్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్లు విళ్ళ పళ్ళంరాజు,మాచిరాజు లక్ష్మీనారాయణ, ఈవోలు ఆర్.సౌజన్య, సి.హెచ్. విజయభాస్కర్ రెడ్డి, కాళ్లకూరి సుబ్రహ్మణ్యం,జి.శివబాబు, వద్దాది సత్యనారాయణ, ఎం.మురళీ వీరభద్రరావు, టీ.వీ. సూర్యనారాయణ ,యర్రా వెంకటేశ్వరరావు,ఆశాఖ అధికారులు బాలాజీ, దేగల సతీష్ కుమార్, వడ్డి పనింద్ర కుమార్, రాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ డా.గుడిపాటి మధుకు అమెరికా డాక్టర్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** డా.గుడిపాటి మధు ప్రస్తుతం కిట్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి ఫర్ ఉమెన్‌లో ప్రిన్సిపల్‌గా పెద్దాపురం మండలం దివిలి కిట్స్ కాలేజ్ నందు విధులు నిర్వహిస్తున్నారని, ముఖ్యంగా ఆయన పిహెచ్‌డి అభ్యసించడానికి రూ.26 లక్షల విలువైన నేషనల్ ఫెలోషిప్ (యుజిసి-జెఆర్ఎఫ్-ఎస్ఆర్ఎఫ్) రూపంలో యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ యుజిసి నుంచి గణనీయమైన మద్దతు పొందారు. అతని ఆవిష్కరణ, మేధోసంపత్తి రంగానికి విస్తరించింది. ఇక్కడ అతను భారతదేశంలో ఆరు పేటెంట్‌లు కలిగి ఉండడం ఎంతో అభినందించదగ్గ విషయం. తన పరిశోధన రచనలకు మించి డా.మధు ఫార్మస్యూటికల్ సైన్సెస్ రంగంలో ఆరు పుస్తకాలను రచించారు. మరియు మల, పెద్ద ప్రేగు క్యాన్సర్‌కు సహజ నివారణ లు, అలాగే ఫావిపిరావిర్ రూపకల్పన, కారెక్టరైజేషన్ మరియు ఇన్-విట్రో మ్యూలంకనంపై దృష్టి సారించిన మూడు పుస్తక అధ్యాయాలకు సహకరించడం జరిగింది. ఒరోడిస్పెర్సిబుల్ ఫిల్మ్, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ మరియు ఎల్సెవియర్ వంటి ప్రసిద్ధ పత్రికలలో 57 పరిశోధన మరియు సమీక్ష కథనాలను ప్రచురించడం అతని విస్తృతమైన పనిని కలిగియున్నది. అతను యంగ్ సైంటిస్ట్ అవార్డు న్యూఢిల్లీ, ఉత్తమ ఫ్యాకల్టీ, యంగ్ ఫార్మసి ఫ్యాకల్టి, యంగ్ ప్రొఫెషనల్ అవార్డుతో సహ 14 జాతీయ మరియు అంతర్జాతీయ అవార్డులను డా.గుడిపాటి మధు అందుకున్నారు. జెఎన్‌టియు కాకినాడ వైస్ ఛాన్సలర్ ప్రొ.కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ సమక్షంలో గౌరవ డాక్టర్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్ అందుకోవడం జరిగింది. ఆయన సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ అమెరికా నుండి డాక్టర్ ఆఫ్ సైన్స్ డాక్టరేట్ అందుకున్నారు. వీరు చూపిన అత్యంత ప్రతిభకు ఈ గౌరవ డాక్టరేట్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ టెక్నాలజి తరపు ఇవ్వడం జరిగింది. నేషనల్ టీచర్స్ డే పురస్కరించుకుని ఇండియాలో కొంతమందికి ఈ అరుదైన అవార్డు ఇవ్వడంలో భాగంగా ఈ అవార్డు డా.గుడిపాటి మధుకు దక్కింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసర్, ఏఓ జెన్నిబాబు, పెదకాపు, పలువురు డా.గుడిపాటి మధును అభినందించినవారిలో ఉన్నారు.

స్వర్ణ ఆంధ్రా @2047 సాధన కోసం

# మండల స్థాయి ప్రణాళికలు అందజేయాలి

-100 రోజులు, వార్షిక, ఐదేళ్ల ప్రణాళికలతో ప్రతిశాఖ నివేదిక రూపొందించాలి
-వ్యవసాయ అనుబంధ, పర్యటక, పరిశ్రమల, విద్య వైద్య, ఇతర శాఖలు 2047 లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి -జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** స్వర్ణ ఆంధ్రా ఏ2047 లక్ష్య సాధనకు అనుగుణంగా జిల్లా స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకుని వాటిని మండల, మునిసిపల్ స్థాయి లో ఆచరణ సాధ్యం చేసేలా కార్యాచరణ ఉండాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు.

గురువారం ఉదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరభ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుండి జిల్లా కలెక్టరు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి కలెక్టరు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, వికసిత భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణ ఆంధ్రా ఏ2047 లక్ష్య సాధన కోసం మండల స్థాయి ప్రణాళికలు సెప్టెంబరు నెలాఖరుకి అందజేయాల్సి ఉంటుందన్నారు. అదే క్రమంలో జిల్లా స్థాయి లో సమీకృతం చేసి నివేదిక అక్టోబర్ 15 లోగా అందజేయాల్సి ఉంటుందన్నారు. స్వర్ణ ఆంధ్ర ఏ2047 విజన్ పర్యవేక్షణ మరియు అమలు విధానంలో ఐదేళ్ళ దీర్ఘకాలిక వ్యూహం అమలు చేసేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. ఆమేరకు రాష్ట్ర స్థాయిలో నవంబర్ ఒకటవ తేదీన రాష్ట్ర స్థాయిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆ క్రమంలో రానున్న ఐదేళ్ళ కాలంలో 2024 నుంచి 2029 వరకూ ఒక విజన్ తో కూడిన నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతీ ఒక్క డిపార్ట్మెంట్ వికసిత 2047 లక్ష్య సాధనలో నిర్ణాయక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య విధానం, నైపుణ్య అభివృద్ధి లక్ష్యాలు సాధన విషయంలో ఆచరణ సాధ్యం అయ్యే విధంగా ప్రతిపాదనలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఉదాహరణ గా వ్యవసాయ, హార్టీకల్చర్, మత్స్య రంగాల్లో ప్రస్తుతం దిగుబడులు, రానున్న రోజుల్లో అంతర్ సాగు విధానం , అధిక ఆదాయం, ప్రకృతి సాగు విస్తీర్ణం పెంపు, ఖర్చుల నియంత్రణా విధానంలో మార్పు తీసుకొని రావడం వంటి అంశాలను పొందుపరచాల్సి ఉందన్నారు. అదే విధంగా వైద్య సేవలు, పరీక్షలు, నియంత్రణా విధానం, పరీక్షలు పెంపు, మెరుగైన చికిత్స విధానాలు, ప్రవేటు రంగం లో పొందుతున్న చికిత్సా విధానాలు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పన, పరిశ్రమలకి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, గ్రోత్ ఇంజన్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, గుర్తింపు పొందిన ప్రాజెక్టులు వారీగా సమగ్ర వివరాలు అందచేయాలన్నారు.ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రూ.19.31 లక్షలు శృంగార వల్లభ స్వామి హుండీ ఆదాయం



పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురం మండలంలోని తొలితిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానంలో గురువారం దేవదాయశాఖ ఉన్నతాధికారులు సిహెచ్.రామ మోహనరావు, దేవదాయ శాఖ డివిజనల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.ఉదయ్‌బాబునాయుడుల ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించగా, హుండీల ద్వారా 79 రోజులకు గాను రూ.13,12,116/-లు,అన్నదానహుండీలద్వారా రూ.6,19,580/-లు మొత్తం రూ.19,31,696/- ల ఆదాయం వచ్చిందని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, దేవస్థాన అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణా చార్యులు, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు, దేవస్థాన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ లైన్ల మరమ్మత్తులు కారణంగా సరఫరాకు అంతరాయం

-ఏఈ ఎం డేవిడ్ నిచ్చల్



**పెరవలి, మేజర్ న్యూస్ :** సెప్టెంబర్ 20వ తేదీ శుక్రవారం పెరవలి మండలంలోని పెరవలి విద్యుత్ ఉపకేంద్రంపరిధినందు మల్లేశ్వరం మరియు ఖండవల్లి ఫీడర్ విద్యుత్ లైన్ల మీద చెట్ల కొమ్మలను తొలగింపు మరియుమర్మత్తుల నిమిత్తం మల్లేశ్వరం ,నల్లాకులవారి పాలెం,ఖండవల్లి,పిట్టలవేమవరం మరియు అన్నవంప్పాడు, గ్రామ ప్రజలకు ఉదయం 7గంటలనుంచిమధ్యాహ్నం12 గంటలవరకు విద్యుత్‌సరఫరాలోఅంతరాయముకలుగుతుందనిదీనికి వినియోగ దారులందరూ సహకరించాలని పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ ఏఇ ఎం డేవిడ్ నిచ్చల్ తెలియజేశారు.పైన తెలిపిన గ్రామములకు వ్యవసాయ విద్యుత్ సమయములు ఉదయం 4 గంటల నుండి 7 గంటల వరకు మరియు మధ్యాహ్నం12గంటల నుండి సాయంత్రం 5గంటలవరకు మార్చడమైనది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగ ఏఈ ఎం డేవిడ్ నిచ్చల్ కోరారు.